క్లుప్తంగా

నూతన కార్యవర్గం



పట్రాజు సంఘం చార్మినార్ శాఖ నూతన కార్యవర్గ సభ్యులు వీరే..

గౌలిపురా: తెలంగాణ రాష్ట్ర పట్రాజు సంఘం చార్మినార్ శాఖ ఎన్నికలు మంగళవారం జరిగాయి. చార్మినార్ శాఖ నూతన కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం అధ్యక్షుడిగా సీఎం.నవీన్ రాజు, ఉపాధ్యక్షులుగా డి.శేషభూషణ్ రాజు, సీఎం.ప్రవీణ్ రాజు, డి.వేణుమాధవ్ రాజు, బి.నాగమణి, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్.విశ్వంధర్ రాజు, ఉప ప్రధాన కార్యదర్శిగా పి.వెంకట్ రాజు, బి.నరస రాజు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా డి.ఎతి రాజు, డి.అమృతరాజు, న్యాయ సలహాదారులుగా సీఎం.విజయలక్ష్మి, కోశాధికారిగా డి.ఆనంద్ రాజు, కార్యనిర్వాహక సభ్యులుగా సీఎం.మణి ప్రశాంత్ రాజు, పి.మణికంఠ రాజు, బి.ఆదిత్య రాజు, సాయి కృష్ణ రాజులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ప్రతికంతం విఘ్నేశ్వర్ రాజు, పరిశీలకుడిగా విశ్వనాథ త్యాగరాజు వ్యవహరించారు.

ఘనంగా మార్కండేయ జయంతి



స్వామివారి పల్లకి సేవ

గోల్కొండ: మార్కండేయ స్వామి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్వాన్‌లోని శ్రీ శివమార్కండేయ స్వామి ఆలయంలో స్వామి వారి జయంతి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. స్వామి వారికి అభిషేకం అనంతరం పల్లకీ సేవ నిర్వహించారు. స్వామి వారి జయంతి ఉత్సవాల్లో పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. ఆలయ కమిటీ ట్రస్ట్ కమిటీ అధ్యక్షుడు ఆటిపాముల నర్సింహారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజా కార్యక్రమాల్లో పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు అంబటి సంతోష్, హరిదాసు, మాణిక్ ప్రభు, కొకుంట్ల కల్పన, అంబటి శ్రీనివాస్, మౌనిక, దయానంద్, ముదిగొండ సాయి కిరణ్ పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్‌లో బాలీవుడ్ నటుడి సందడి



బాలీవుడ్ నటుడు అస్రానిని సన్మానిస్తున్న ఎగ్జిబిషన్ సొసైటీ నిర్వాహకులు

గన్‌ఫౌండ్రీ: నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జరుగుతున్న 82వ అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్)లో బాలీవుడ్ నటుడు అస్రాని మంగళవారం సందడి చేశారు. తన ఆటపాటలతో సందర్శకులను మైమరిపించారు. ఆయన మాట్లాడుతూ.. నుమాయిష్ తనకు ఎంతో బాగా నచ్చిందన్నారు. అనంతరం ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు అశ్విని మార్గం ఆయనను ఘనంగా సన్మానించారు.

బాధ్యతల స్వీకరణ

దూద్‌బౌలి: అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని చార్మినార్ సర్కిల్–9 టౌన్ ప్లానింగ్ ఏసీపీ ఇనుకొండ రాణి అన్నారు. రాజేంద్రనగర్ మున్సిపాలిటీ నుంచి మంగళవారం బదిలీపై వచ్చిన ఆమె సర్కిల్–9 టౌన్ ప్లానింగ్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణాల అనుమతుల కోసం దళారులను ఆశ్రయించొద్దని ఆమె ప్రజలకు సూచించారు. మున్సిపల్ నిబంధనల ప్రకారమే ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా.. నేరుగా తన కార్యాలయంలో సంప్రదించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన టీఎస్ బీ–పాస్ ద్వారా ఇళ్ల అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వాటిని పరిశీలించి 15 రోజుల్లోపే ఇస్తామన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



అబిడ్స్: ఫుట్‌పాత్‌పై పడి ఉన్న గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని షాహినాయత్‌గంజ్ పోలీసులు స్వాధీనం చేసుకొని ఉస్మానియా మార్చురికి తరలించారు. ఎస్సై గోపాల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. బేగంబజార్ ఫిష్‌మార్కెట్ ముందు ఓ వ్యక్తి (50 ఏళ్ల) మృతదేహం పడిఉన్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో ఆ మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రిలో భద్రపరిచారు. అతని ఒంటిపై చెక్స్ షర్ట్, గ్రే కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. సమాచారం తెలిసిన వారు షాహినాయత్‌గంజ్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్సై వివరించారు.

రక్తచరిత్ర @ 100 ఫీట్ రోడ్

హత్యలతో బెంబేలెత్తిస్తున్న పురానాపూల్ జాతీయ రహదారి
- రాత్రి అయిందంటే భయం భయం
- అక్రమ పార్కింగ్‌లతో స్వల్ప గొడవలు
- గస్తీ పెంచాలంటున్న స్థానికులు



నిర్మానుషంగా పురానాపూల్ 100 ఫీట్ల జాతీయ రహదారి



రహదారి పక్కనే ఇమాంపురా గ్రేవ్‌యార్డు

జియాగూడ: పురానాపూల్ 100 ఫీట్ల జాతీయ రహదారి హత్యలకు నెలవుగా మారింది. సంఘ విద్రోహులు ఈ ప్రాంతమే లక్ష్యంగా నేరాలకు పాల్పడుతున్నారు. రహదారి పూర్తిగా నిర్మానుష్యంగా ఉండడం రహదారి ఇరుపక్కల మూసీనది ఇమాంపురా గ్రేవ్‌యార్డు ఎకరాలలో ఉండడం, చెట్లు చేమ అధికంగా పెరిగి ఉండడం సంఘ విద్రోహులకు అడ్డాగా మారింది. ఎప్పుడు ఎలాంటి ఘటన నగరంలో చోటుచేసుకున్నా వాటి మూలాలు జాతీయ రహదారి కావడం గమనార్హం. ఈ రహదారి 8 ఏళ్ల నుంచి వాడుకలోకి రాగా నాటి నుంచి ఏదో సంఘటన రహదారిలో, పక్కనే ఉన్న మూసీనదిలో, గ్రేవ్‌యార్డు చెట్ల పొదల్లో చోటు చేసుకుంటున్నాయి. స్థానిక కుల్సుంపురా పోలీసులు ఈ రహదారి పట్ల ఎలాంటి కట్టుదిట్ట చర్యలు తీసుకోవడం లేదని ఆందోళన చెందుతున్నారు.

నిర్మానుషంగా జాతీయ రహదారి..

- జాతీయ రహదారి నిర్మాణం పూర్తయినప్పటికీ పురానాపూల్ జాతీయ రహదారి మీదుగా కార్వాన్, రింగ్‌రోడ్డు, అత్తాపూర్, హైటెక్‌సిటీ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ రింగ్ రోడ్డు ఉపయోగపడుతుంది.
- రాత్రివేళల్లో మాత్రం ఈ రహదారి భయానకంగా మారుతుంది. రహదారి ఇరుపక్కలా జన సంచారం లేకపోవడం, చెట్లు చేమలు అధికంగా ఉండడం, మరోపక్క మూసీనది ఉండడం, రాత్రివేళల్లో వీధిదీపాలు వెలగకపోవడం, సీసీ కెమెరాలు లేకపోవడం వల్ల సంఘ విద్రోహులు ఈ ప్రాంతాన్ని ఎంచుకుని నేరాలకు పాల్పడి పరారవుతున్నారు.
- పురానాపూల్ నుంచి రాంసింగ్‌పురా, గిరికపల్లి వరకు గల ఈ రహదారిలో తరచూ పోలీస్ పెట్రోలింగ్, చెకింగ్‌లు అనుమానితుల పట్ల కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

భయానకంగా ఇమాంపురా గ్రేవ్‌యార్డు..

- ఇమాంపురా గ్రేవ్‌యార్డు జాతీయ రహదారిని ఆనుకుని ఉంది. ఈ ఇమాంపురా గ్రేవ్‌యార్డు ఎకరాలలో ఉండగా చెట్లు చేమలు, ముళ్లపొదలు, ఏపుగా పెరిగాయి.
- సంఘ విద్రోహులు ఈ ప్రాంతాన్ని ఎంచుకుని నేరాలకు పాల్పడుతున్నారు. రాత్రయితే జాతీయ రహదారి గుండా వెళ్లాలంటేనే ప్రయాణికులు జంకుతున్నారు.
- పురానాపూల్ వైన్స్‌ల వద్ద మద్యం కొనుగోలు చేసేవారు జాతీయ రహదారి పక్కనే మద్యం సేవిస్తున్నారు. దీనివల్ల కూడా వారి మద్యలో తలెత్తే గొడవలు కూడా హత్యలకు దారితీస్తున్నాయి.

రహదారిలో అక్రమ పార్కింగ్..

- జాతీయ రహదారిలో అక్రమ పార్కింగ్ జోరుగా కొనసాగుతుంది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే గొర్రెలు, మేకల లారీను రహదారిలో నిలిపి వేస్తున్నారు. అందులో ఉండే డ్రైవర్లు మద్యం సేవించి నేరాలకు కూడా పాల్పడుతున్నారు.
- ఎక్కడి నుంచో వచ్చే లారీలు రోజుల తరబడి జాతీయ రహదారిలో నిలిచి ఉంటున్నాయి. మద్యం సేవించే వారు గొడవలకు పాల్పడగా హత్యలకు దారి తీస్తుంది.
- రహదారి పురానాపూల్, జాతీయ రహదారి మేకలమండి వద్ద కూడా వైన్స్‌లు, బార్‌లు జోరుగా కొనసాగుతుంది.
- రహదారి, గ్రేవ్‌యార్డు ప్రాంతాల్లో పోలీసులు ప్రత్యేక నిఘా పెంచాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

భక్తిశ్రద్ధలతో కొండ పోచమ్మకు బంగారు బోనం



ఒడిబియ్యం, పట్టు వస్త్రాలు, బంగారు బోనం తీసుకెళ్తున్న నిషా క్రాంతి, రాకేశ్ తివారీ, గాజుల అంజయ్య

చార్మినార్: భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ రాకేశ్ తివారీ ఆధ్వర్యంలో మంగళవారం కొండ పోచమ్మ అమ్మవారికి ఒడి బియ్యం, పట్టు వస్త్రాలు, బంగారు బోనం సమర్పించారు. మంగళవారం ఉదయం పాతబస్తీ నుంచి బయలుదేరిన భక్తులు మధ్యాహ్నం శివశక్తి నిషా క్రాంతి తలపై బంగారు బోనాన్ని ఎత్తుకొని చర్నకోలాలు చేతిలో పట్టుకొని నృత్యాలు చేస్తూ అమ్మవారికి బంగారు పాత్రలో బోనాన్ని సమర్పించారు. కొండ పోచమ్మ ఆలయ సమీపంలోని పాటేల్ సదానంద్ యాదవ్ వసతి గృహం నుంచి బయలుదేరిన బంగారు బోనం సామూహిక ఊరేగింపు భాజాభజంత్రీల నడుమ ముందుకు కొనసాగింది. దారి పొడవునా భక్తులు బంగారు బోనానికి సాక పోసి ఘనంగా స్వాగతం పలికారు. మీరాలంమండి శ్రీ మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య, ప్రతినిధులు అనంతోజు హన్స్‌రాజ్, రాజేశ్, వెంకటేశ్‌యాదవ్, లెనిన్ బాబు, గాజుల రాహుల్, అజయ్‌కుమార్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సత్కారం



సీఎస్ శాంతికుమారిని కలిసిన రమణయ్య, నేలమడుగుల మురళీకృష్ణ తదితరులు

అబిడ్స్: తెలంగాణ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ శాంతికుమారిని రాష్ట్ర టింబర్ ఫెడరేషన్ అధ్యక్షుడు సీహెచ్. రమణయ్య ఆధ్వర్యంలో మంగళవారం కలిసి ఘనంగా సత్కరించారు. టింబర్ ఫెడరేషన్ తరపున ఆమెను సత్కరించి 2023 కాలమానిని పత్రికను ఆమె చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నేలమడుగుల మురళీకృష్ణ, గోపీకృష్ణ, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బాల్క సుమన్ తదితరులు

సుల్తాన్‌బజార్: తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా టేబుల్ కేలండర్ ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ హాజరై టీఎస్‌సీపీఎస్‌ఈయూ టేబుల్ కేలండర్ 2023ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దు అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు నరేందర్ రావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కోటకొండ పవన్, జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడు మహేందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్, జాయింట్ సెక్రటరీ మహమూద్, సుధాకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ యుగపురుషుడు

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



విఠల్‌కు పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: నటసామ్రాట్ ఎన్టీఆర్ యుగపురుషుడని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. శృతిలయ ఆర్ట్స్ అకాడమీ, సీల్‌వెల్ కార్పొరేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం రవీంద్రభారతిలో ఎన్టీఆర్ శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సినీనటుడు మురళీమోహన్‌కు ఎన్టీఆర్ సిల్వర్‌క్రౌన్ నట పురస్కారం, ఎల్‌ఐసీ ఏజెంట్‌గా ఇండియాలోనే నెంబర్:1 స్థానంలో నిలిచిన కె.విఠల్‌కు శ్రమశక్తి పురస్కారాలను ప్రదానం చేశారు. సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.... ఎన్టీఆర్‌ను నేటితరం నటీనటులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కె.దామోదర్‌గుప్తా, సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండీ బండారు సుబ్బారావు, సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞ శర్మ, సినీ దర్శకుడు రేలంగి నర్సింహారావు, సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి ఆమని తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఖిల్వత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. చార్మినార్, లాడ్‌బజార్, షాగంజ్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లోని ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు. దూద్‌బౌలి, రూప్‌లాల్‌బజార్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.


ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ పరిధిలో..

విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. కందికల్‌గేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు. ముస్తాఫానగర్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు సరఫరా ఉండదన్నారు. అలియాబాద్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

'5వ తేదీ లోపు అర్చకులకు జీతాలు చెల్లించాలి'

సుల్తాన్‌బజార్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అర్చకులందరికీ గ్రాంటిన్ ఎయిడ్ ద్వారా 5వ తేదీ లోపు జీతాలు ఇవ్వాలని అర్చక జేఏసీ నాయకులు ఆర్థికశాఖ మంత్రి హరీష్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం అర్చక జేఏసీ చైర్మన్ గంగూ ఉపేంద్రశర్మ, అర్చక ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు కందూరి కృష్ణమాచారి, కన్వీనర్ పరశురామ్ రవీంద్రచార్యులు మాట్లాడారు. రాష్ట్రంలో 5625 మంది అర్చక ఉద్యోగులు ఉంటే 5వేల మందికే గ్రాంటిన్ ఎయిడ్ ద్వారా వేతనాలు అందుతున్నాయని తెలిపారు. 625 మందికి వేతనాలు అందడంలేదని వాపోయారు. జూన్ 2వ తేదీ 2014ను కటాఫ్‌గా నిర్ణయించి జీఓ నంబర్:121 తీసుకువచ్చి వీరికి జీతాలు ఆపివేశారని తెలిపారు. ప్రస్తుతం జీతాలు ప్రతినెలా 5వ తేదీ లోపు వచ్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రి హరీష్‌రావుకు విన్నవించినట్లు తెలిపారు.

ఎగ్జిబిషన్‌లో బుద్ధిమాంద్యం పిల్లల సందడి



గన్‌ఫౌండ్రీ: నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జరుగుతున్న నుమాయిష్‌లో బుద్ధిమాంద్యం పిల్లలు మంగళవారం సందడి చేశారు. షామీర్‌పేటకు చెందిన ఆటిజం ఇనిస్టిట్యూట్‌కు చెందిన 60 మంది పిల్లలు ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్ సొసైటీ నిర్వాహకులు ఆ పిల్లలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఇనిస్టిట్యూట్ నిర్వాహకులు అనిల్‌కుంద్రా మాట్లాడుతూ.. బుద్ధిమాంద్యం కలిగిన పిల్లలకు ఎగ్జిబిషన్ తిలకించే అవకాశం కల్పించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అంతకు ముందు పిల్లల కోసం ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు అశ్విన్‌మార్గం, కార్యదర్శి సాయినాథ్, సుఖేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆనందం..

బుద్ధిమాంద్యం కలిగిన పిల్లలు ఎగ్జిబిషన్‌లో ఎంతో ఆనందంగా గడిపారు. చుక్ చుక్ రైలులో ఎగ్జిబిషన్‌ను చుట్టిరావడంతో పాటు పలు స్టాళ్లను ఆసక్తిగా తిలకించారు. ఈ చిన్నారుల సహాయకులు మాట్లాడుతూ.. ఇలాంటి అతిపెద్ద ఎగ్జిబిషన్‌ను తిలకించడానికి వీళ్లను తీసుకురావడం మొదటిసారిని తెలిపారు.

కుట్టు మెషిన్ల వితరణ

నాంపల్లి: జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని మెట్రోపాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ హైదరాబాదు, కేరింగ్ హ్యాండ్స్, సంస్థల సంయుక్తాధ్వర్యంలో మంగళవారం కుట్టు మిషన్ల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా పాపిరెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు కుట్టు మిషన్లు అందజేశారు. పేదరిక నిర్మూలన పథకాల ప్రభావవంతమైన అమలు పథకం (ఎన్ఎఎల్ఎస్ఎ)–2015 అమలులో ఉందని, దానిని సద్వినియోగం చేసుకోవాలని పాపిరెడ్డి తెలిపారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం



మార్గదర్శిని ఎన్జీఓ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ

అబిడ్స్: బాలికల సంరక్షణకు విద్యాసంస్థలతో పాటు స్వచ్ఛంద సంస్థలూ తమవంతు సహకారం అందజేయాలని మార్గదర్శిని స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు అరుణజ్యోతి పేర్కొన్నారు. జాతీయ బాలికా దినోత్సవ వేడుకల్లో మార్గదర్శిని ఎన్జీఓ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు మార్గదర్శిని సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అనంతరం అరుణజ్యోతి మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచే బాలికలను అన్నిరంగాల్లో ప్రావీణ్యం చెందే విధంగా విద్యాసంస్థలతో పాటు తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. నూర్జాహాన్, ఫ్యామిలీ కౌన్సిలర్ నిహారిక, నీలిమా, శ్రీకాంత్, మాధవి, కార్తిక్ పాల్గొన్నారు.

సిటీ కళాశాలలో..



సిటీ కళాశాలలో డిగ్రీ విద్యార్థినిని సన్మానిస్తున్న అధ్యాపక బృందం

చార్మినార్: ప్రభుత్వ సిటీ కళాశాలలో మహిళా సాధికారిత సెల్ ఆధ్వర్యంలో మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాల భాస్కర్ నేతృత్వంలో జాతీయ బాలిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బాలికల పరిరక్షణ, ఉన్నత విద్య, ఆవశ్యకత గురించి సదస్సులో చర్చించారు. నేటి బాలికలే రేపటి మహిళలు.. నేడు స్త్రీలు అన్ని రంగాల్లో ఉన్నత పదవుల్లో రాణిస్తున్నారన్నారు. జాతీయ బాలిక దినోత్సవంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఎన్‌సీసీ కాడెట్ శ్రీలత, భారతదేశం తరపున బంగ్లాదేశ్‌లో జరిగిన బాస్కెట్ బాల్ పోటీల్లో పాల్గొనడం జరిగింది. కన్వీనర్ డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ నర్మదా, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ వేదవతి, డాక్టర్ సుదక్షిణ, సుజాత, డాక్టర్ చిత్తరంజన్, డాక్టర్ శంకర్‌లు పాల్గొన్నారు.

అంధత్వ రహిత సమాజమే లక్ష్యం: మంత్రి తలసాని



కంటివెలుగు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి తలసాని తదితరులు

సుల్తాన్‌బజార్: అంధత్వ రహిత సమాజమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కంటివెలుగు కార్యక్రమాన్ని చేపట్టిందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని చాదర్‌ఘాట్ విక్టోరియా ప్లే గ్రౌండ్‌లో కంటివెలుగు శిబిరాన్ని మంత్రి శ్రీనివాస్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటివెలుగు కార్యక్రమం నిర్వహణపట్ల ప్రభుత్వం సంతృప్తిగా ఉందన్నారు. కంటిచూపు సమస్యలతో బాధపడుతున్న ప్రజలను దృష్టిలో ఉంచుకుని సీఎం కేసీఆర్ కంటివెలుగు అనే కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. జూన్ 30వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు. బీఆర్ఎస్ నాయకులు రాంచందర్‌రాజు, ప్రేమ్‌సింగ్ రాథోడ్, గడ్డం శ్రీనివాస్ యాదవ్ దిలీప్ ఘనాటే పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి: రాజాసింగ్



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్, కార్పొరేటర్ లాల్‌సింగ్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. గోషామహల్‌లో రూ.15 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీవరేజ్ పైప్‌లైన్ నిర్మాణ పనులను కార్పొరేటర్ లాల్‌సింగ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని నలుమూలలా రోడ్ల నిర్మాణాలు, డ్రైనేజీల అభివృద్ధి, ఇతర అన్ని అభివృద్ధి పనులను వేగవంతంగా చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలను అన్నిశాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గోషామహల్ బీజేపీ కన్వీనర్ కృష్ణ, మహేష్ మ్యాదరి, గుణవంతు బిరాదర్, సోమ్రాజ్, సుధాకర్‌గౌడ్, రాజా జవహరి, ప్రదీప్ సింగ్, అక్షయ్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు సమ ప్రాధాన్యం



స్థానికులతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అన్ని వర్గాల వారికి మజ్లిస్ పార్టీ సమ ప్రాధాన్యం ఇస్తుందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. మంగళవారం టోలిచౌకి డివిజన్‌కు చెందిన పలువురు యువకులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మజ్లిస్ పార్టీపై ప్రజలకు ఎంతో నమ్మకం ఉందని, ప్రజలపక్షాన ఉంటూ వారి సమస్యలు పరిష్కారానికి తాము కృషి చేయడమే దీనికి కారణమన్నారు. మజ్లిస్ పార్టీ సెక్యులర్ పార్టీ అన్న నిజాన్ని ప్రజలు గుర్తించడం వల్లే తమ పార్టీకి ప్రజల మద్దతు పెరుగుతుందన్నారు. చిన్నపాటి వర్షానికే ముంపునకు గురయ్యే టోలిచౌకి డివిజన్ బస్తీలకు తాను శాశ్వతంగా వరదముంపు ప్రమాదాన్ని తప్పించామన్నారు. ఈ కార్యక్రమంలో టోలిచౌకి డివిజన్ మజ్లిస్ నాయకులు మహ్మద్ హారూన్ ఫరాన్ తదితరులున్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న జిల్లా సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి రేణుకా యారా

యాకుత్‌పురా: ఫిబ్రవరి 11న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని హైదరాబాద్ జిల్లా సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ రేణుకా యారా సూచించారు. ఫిబ్రవరి 11న దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకొని పురానీహవేలిలోని సిటీ సివిల్ కోర్టులో మంగళవారం సన్నాహాక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జాతీయ లోక్ అదాలత్ తమ వివాదాలను రాజీ పద్ధతిలో పరిష్కరించుకొని సత్వర న్యాయం పొందాలన్నారు. ఈ లోక్ అదాలత్‌లో అన్ని రకాల సివిల్ కేసులు, మోటార్ ప్రమాద పరిహార కేసులు, బ్యాంక్ కేసులు, కుటుంబ వివాదాలు, ఆస్తి తగాదాలు రాజీ పద్ధతిలో పరిష్కరించుకోవచ్చునన్నారు. కక్షిదారులు పట్టుదలకు పోకుండా రాజీ పద్ధతిలో వివాదాలను పరిష్కరించుకుంటే ఇరువురికి మేలు జరుగుతుందన్నారు. లోక్ అధాలత్‌తో తమ కేసులను పరిష్కరించుకోదలచిన కక్షిదారులు తమ న్యాయవాది ద్వారా సిటీ సివిల్ కోర్టు న్యాయ సేవాధికార సంస్థలో సంప్రదించి ఫిబ్రవరి 11 లోగా ప్రీ లోక్ అదాలత్‌లలో తమ వివాదాన్ని పరిష్కరించుకోవచ్చునన్నారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

గోల్కొండ: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని టోలిచౌకిలోని ఇంటిగ్రల్ ఫౌండేషన్ స్కూల్ డైరెక్టర్ తలత్ నిగార్ అన్నారు. మంగళవారం నానల్‌నగర్‌లోని ఆలివ్ ఆస్పత్రి సహకారంతో ఇంటిగ్రల్ ఫౌండేషన్ స్కూల్‌లో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఫ్రీ హెల్త్ కేర్ డ్రైవ్ నిర్వహించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి వైద్యులు సలహాలు, సూచనలు ఇచ్చారు. పిల్లలకు ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తుండటం మంచి విషయమని కార్యక్రమంలో పాల్గొన్న షేక్‌పేట్ కార్పొరేటర్, బల్దియా స్టాండింగ్ కమిటీ సభ్యులు మహ్మద్ రాషెద్ ఫరాజుద్దీన్ అన్నారు. విద్యార్థులపై శ్రద్ధ కనబరుస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని, కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హాజరైన గోల్కొండ ఎస్సై గణేష్ అన్నారు.